# సాక్షి
## వైఎస్సార్ జిల్లా

గురువారం । 5 । జూన్ । 2025




**భారీగా మొబైల్‌ఫోన్లు రికవరీ**
పోలీస్ బృందం చేపట్టిన మొబైల్ ఫోన్ల రికవరీ సత్ఫలితాలను ఇస్తోంది. జిల్లాలో 601 మొబైల్ ఫోన్లను రికవరీ చేశారు. - 12లో



**టీడీపీ నేతల దాష్టీకం**
పులివెందులలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటినుంచి అధికార పార్టీ నాయకుల ఆగడాలు హెచ్చుమీరుతున్నాయి. - 12లో

**గరిష్టం/కనిష్టం**
**38.2 /26.0**

**వాతావరణం**
జిల్లాలో బుధవారం 26.0 - 38.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

# వంచనపై గర్జన

- వెన్నుపోటు దినానికి పోటెత్తిన ప్రజానీకం
- జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ భారీ ర్యాలీలు
- కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డుల ప్రదర్శన...పెద్ద ఎత్తున నినాదాలు
- ఏడాది చంద్రబాబు పాలనపై ధ్వజమెత్తిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పిలుపు మేరకు జిల్లాలోని కడప, ప్రొద్దుటూరు, పులివెందుల, మైదుకూరు, కమలాపురం, బద్వేల్, జమ్మలమడుగు నియోజకవర్గాల్లో ×వెన్నుపోటు దినం≤ కార్యక్రమం బుధవారం భారీ ఎత్తున నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన ఆందోళనకు జనం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఎం చంద్రబాబు వ్యవహారశైలిపై వైఎస్సార్‌సీపీ నేతలు నిప్పులు చెరిగారు. ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులను కూడా కొనసాగించకుండా దుర్బుద్ధితో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల్లో ప్రజల్ని మభ్యపెట్టి అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఒరిగింది శూన్యమని చంద్రబాబు ఏడాదికే విఫలమయ్యారని ఆరోపించారు. అనంతరం ఆయా ప్రాంతాల్లోని అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు.

- వైఎస్సార్ కడప జిల్లా కేంద్రమైన కడపలో జిల్లా పార్టీ కార్యాలయం నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు. పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈర్యాలీ కోటిరెడ్డి సర్కిల్, ఎన్‌టీఆర్ కూడలి, ఏడురోడ్ల కూడలి మీదుగా ఆర్‌డీఓ కార్యాలయం వద్దకు చేరింది. ఆర్‌డీఓ అందుబాటులో లేకపోవడంతో ఏఓ శంకరయ్యకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాకా సురేష్ పాల్గొన్నారు.
- పులివెందుల పట్టణంలో 'వెన్నుపోటు దినం' కార్యక్రమానికి జనం పోటెత్తారు. కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌వీ సతీష్‌రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పాత ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ మెయిన్ రోడ్డు మీదుగా పాత ఆర్‌టీసీ బస్టాండు మీదుగా ఆర్‌డీఓ కార్యాలయం వరకూ చేరింది. అనంతరం ఆర్‌డీఓ వెంకటేశంకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వ్యాప్తంగా వేలాది మంది నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.
- ప్రొద్దుటూరు పట్టణంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో అతిపెద్ద ర్యాలీ నిర్వహించారు. పుట్టపర్తి సర్కిల్ నుంచి మొదలైన ఈ ర్యాలీ శ్రీరాములుపేట మీదుగా మున్సిపల్ కార్యాలయానికి చేరింది. అనంతరం కమిషనర్ మల్లికార్జునకు వినతి పత్రం సమర్పించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి, మాజీ ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీ, పార్టీ నేతలు పోరెడ్డి నరసింహారెడ్డి, కల్లూరు నాగేంద్రారెడ్డి, కోనేటి సునంద తదితరులు పాల్గొన్నారు.
- మైదుకూరు పట్టణంలో మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పోరుమామిళ్ల రోడ్డు నుంచి ప్రారంభమైన ర్యాలీ అంకాలమ్మ దేవాలయం మీదుగా ఎంపీడీఓ కార్యాలయం వరకూ సాగింది. అక్కడ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మెన్ రామగోవిందరెడ్డి, మాజీ ప్రభుత్వ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.
- బద్వేల్ పట్టణంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎన్‌జీవో కాలనీలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ నాలుగురోడ్ల కూడలి మీదుగా ఆర్‌డీఓ కార్యాలయం వరకూ సాగింది. అనంతరం ఆర్డీఓ కార్యాలయ ఏఓ ఉదయభారతికి వినతి పత్రం సమర్పించారు. విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిత్యరెడ్డి, మున్సిపల్ చైర్మెన్ రాజగోపాల్‌రెడ్డి, కుడా మాజీ చైర్మెన్ గురుమోహన్ తదితరులు పాల్గొన్నారు.
- జమ్మలమడుగు పట్టణంలో ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు. పార్టీ కార్యాలయం నుంచి మొదలైన ఈ ర్యాలీ నారాపురం దేవాలయం, తేరు రోడ్డు, పెద్ద పసుపుల మోటు, సంజామల మోటు, ఎస్‌బీఐ, పాతబస్టాండు మీదుగా ఆర్‌డీఓ కార్యాలయం వరకూ సాగింది. అక్కడ ఆర్‌డీఓ సాయిశ్రీ కి వినతి పత్రం సమర్పించారు. అలాగే యర్రగుంట్లలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఆయా పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగాల నేతలు హృషికేశవరెడ్డి, రఘునాథరెడ్డి, లక్ష్మయ్య పాల్గొన్నారు.
- కమలాపురం పట్టణంలోని ఖాజీపేట రోడ్డులో ఉన్న గయాజ్ ఫిల్లింగ్ స్టేషన్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ వైఎస్సార్‌సీపీ కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పోచంరెడ్డి నరేన్ రామాంజులరెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ శివరామిరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మెన్ బాలయ్య, మండల పార్టీ అధ్యక్షులు ఉత్తమారెడ్డి, వీరారెడ్డి, జీఎస్ భాస్కర్‌రెడ్డి, రమణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రఘునాథరెడ్డి, మాజీ ప్రభుత్వ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరులో నిరసన ర్యాలీకి తరలివచ్చిన జనం, మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి



మైదుకూరులో ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, పార్టీ నేతలు, ప్రజలు

## బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ

కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు. ఎన్నికలప్పుడు సూపర్ సిక్స్‌తో పాటు మరో 143 హామీలు ఇచ్చారు. ఉచితంగా బస్సు అన్నారు. నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తామన్నారు. ఇలా చెప్పిన హామీలన్నీ ఏమయ్యాయి. ఏడాదవుతున్నా అతీగతీ లేదు. ఒక్క నెలా కూడా రూ.3వేలు ఇవ్వలేదు. అనేక పథకాలు విస్మరించడమే కాకుండా కూటమి ప్రభుత్వం గొప్పలు చెబుతోంది. వైఎస్ జగన్ హయాంలో గండికోట, సీబీఆర్, చిత్రావతి, పైడిపాలెం, మైలవరం, సర్వరాయ సాగర్, వామికొండ ప్రాజెక్టులకు మహర్దశ కలిగింది. తాగునీరు అవసరమైనప్పుడు మైలవరం ద్వారా పెన్నా నదికి నీటిని వదిలి ప్రొద్దుటూరు, మైదుకూరు, కడప నియోజకవర్గాలకు తాగునీరు ఇస్తున్నాం. ఆయన చేసిన మేలు రైతులు, ప్రజల గుండెల్లో పదిలంగా ఉంటే కూటమి నేతలు మాత్రం జగన్ ఏమీ చేయలేదని సిగ్గు లేకుండా అబద్ధాలు చెబుతున్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో పులివెందులలో డాక్టర్ వైఎస్సార్ మెడికల్ కళాశాల కట్టించారని, కూటమి ప్రభుత్వం వచ్చాక మంజూరైన సీట్లను కూడా మాకు వద్దని చెప్పి వెనక్కి రాసి పంపించిన దౌర్భాగ్యమైన ప్రభుత్వం రాష్ట్రంలో ఉంది. వైఎస్సార్ మెడికల్ కళాశాలకు వైఎస్సార్ పేరును తొలగించారు. వైఎస్ జగన్ హయాంలో పులివెందులలో రూ.25కోట్లతో ఇంటిగ్రేటెడ్ కోల్డ్ స్టోరేజ్‌ను నిర్మిస్తే అది నిర్మాణం పూర్తయ్యి ఎన్నికల సమయానికి ముందే ఆయన ప్రారంభిస్తే, ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏడాది కాలమైనా దాన్ని వినియోగంలోకి తీసుకరాలేని దౌర్భాగ్య పరిస్థితిలో ఉంది. రైతులకు కేంద్రం ఇచ్చే రూ.6వేలు కాకుండా, ఏడాదికి రూ.20వేలు ఇస్తామన్నారు. సంవత్సరమైంది.. ఒక్క రైతుకైనా రూ.20 వేలు ఇచ్చారా. తీవ్రంగా నష్టపోయిన రైతులను ఆదుకోలేదు. కేవలం అమరావతిలోని నాలుగు గ్రామాలు తప్ప. రాష్ట్రంవైపు చూసే పరిస్థితే లేదు. పన్నులు, ఆర్టీసీ చార్జీలు, కరెంటు చార్జీలు పెంచి ప్రజలను నడ్డివిరిచారు. రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారు. ఇసుక, మట్టిని దోచేస్తున్నారు. ఇష్టారాజ్యంగా ఖనిజాన్ని, బెరైటీస్ తరలిస్తూ వేల కోట్ల రూపాయలు అక్రమ ఆర్జనకు కూటమి నేతలు తెరతీశారు. దోపిడీ గురించి మాట్లాడకుండా అన్యాయంగా కేసులు బనాయిస్తున్నారు. అక్రమాలు, అన్యాయాలకు తెరలేపి అరాచక పాలన చేస్తున్నారు. చట్టాన్ని, న్యాయాన్ని కాపాడాల్సిన పోలీసులు ఘోరంగా వ్యవహరిస్తున్నారు. కూటమి నేతలు అధికారం ఉందని.. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా మేము భయపడం.. వాటిని సమర్థవంతంగా ఎదుర్కొంటాం. తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అధికారంలోకి తీసుకొస్తాం.

- వైఎస్ అవినాష్‌రెడ్డి, కడప ఎంపీ



పులివెందులలో నిరసన ర్యాలీకి తరలివచ్చిన ప్రజలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు



పులివెందులలో వినతి పత్రం ఇస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, సతీష్‌రెడ్డి



జమ్మలమడుగులో ర్యాలీలో పాల్గొన్న రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి



కడపలో ర్యాలీలో పాల్గొన్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, పార్టీ నేతలు



బద్వేలులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ



బ్రహ్మంగారిమఠంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ రామగోవిందరెడ్డి

## మోసం... చంద్రబాబు నైజం

ప్రజలను మోసగించడం చంద్రబాబు నైజం. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్నా ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా వెన్నుపోటు పొడిచారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసి చంద్రబాబు వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసేంత వరకు ప్రజల పక్షాన వైఎస్సార్ సీపీ నిరంతరం పోరాటాలు కొనసాగిస్తూనే ఉంటుంది.

- డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్సీ

## అరాచక పాలన

ఎన్నికల సమయంలో ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక చేతులెత్తేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్నా ఏ ఒక్క హామీ అమలు చేయలేదు. తల్లికి వందనం, నిరుద్యోగ భృతి, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు, మూడు గ్యాస్ సిలిండర్లు .. ఇలా హామీలిచ్చి.. వాటి అమలు మరచిపోయారు. పైగా అరాచక పాలనకు తెరతీశారు. ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారు. కచ్చితంగా బుద్ధిచెబుతారు.

- డాక్టర్ సుధ, బద్వేలు ఎమ్మెల్యే




## పథకాలను ఎప్పుడు అమలు చేస్తారు?

రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. మహిళలు రోడ్లపైకి వచ్చారు. జగన్ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల ప్రభావం కారణంగా మహిళలు బ్యాంకుల్లో ఉండేవారని, చంద్రబాబు ప్రభుత్వంలో రోడ్లపైకి రావాల్సిన పరి స్థితి ఏర్పడింది. అబద్ధపు హామీలతో చంద్రబాబు అధికారంలోకి వచ్చారు. ఎన్నికల సందర్భంగా చెప్పిన ఏ హామీని ఆయన నెరవేర్చలేదు. పథకాలు ఎప్పుడు అమలు చేస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దీనికి కూటమి నేతలు సమాధానం చెప్పాలి. పథకాలు అందక పేదలు ఇబ్బందులు పడుతుంటే ఇంటి ముందు రంగవల్లులు వేసుకుని పాయసం, పప్పన్నం చేసుకుని తినాలని కూటమి నేతలు చెప్పడం ఆశ్చర్యంగా ఉంది. చంద్రబాబుపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. అందుకే రోడ్లపైకి వచ్చి నిరసన తెలియజేస్తున్నారు.

- రాచమల్లు శివప్రసాద్ రెడ్డి, ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే

## వెన్నుపోటు బాబుకు వెన్నతో పెట్టిన విద్య ..

వెన్నుపోటు పొడవడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. చంద్రబాబు రాష్ట్రంలో అభివృద్ధి గురించి పట్టించుకోవడం లేదు. బాబు దృష్టిలో అభివృద్ధి అంటే అమరావతి మాత్రమే. సూపర్ సిక్స్ పథకాలు అంటూ మోసపూరిత వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని పక్కనపెట్టారు. అన్ని వర్గాల ప్రజలను నిలువునా ముంచారు. అమలు చేయలేనపుడు హామీలు ఎందుకు ఇచ్చారంటూ ప్రజలు మండిపడుతున్నారు. రోడ్లపైకి వచ్చి నిరసన తెలుపుతున్నారు.

- రఘురామిరెడ్డి, మైదుకూరు మాజీ ఎమ్మెల్యే




ఎర్రగుంట్లలో ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ప్రజలు, నాయకులు



కమలాపురంలో తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న నరేన్ రామాంజుల రెడ్డి, పార్టీ నేతలు

## మోసం గ్యారంటీ అని రుజువు చేశారు

ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను ఒక్కటీ అమలు చేయలేదు. సూపర్‌సిక్స్ పేరుతో ప్రజలతో ఓట్లు వేయించుకున్నారు. అధికారంలోనికి వచ్చాక వాటి అమలు మరచిపోయారు. బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటి అని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి రాగానే బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ అంటూ రుజువు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది అయింది. అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేయలేదు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే లక్షా 75 కోట్ల రూపాయలు అప్పు చేశారు. అమరావతి అభివృద్ధి అంటూ టెండర్లు ప్రక్రియ ప్రారంభించి కమీషన్ రూపంలో కోట్లాది రూపాయలు దండుకుంటున్నారు. ఎంత మంది పిల్లలు చదివితే అందరికీ తల్లికి వందనం అన్నారు. ఇప్పటి వరకు వేయకుండా తల్లులకు వెన్నుపోటు పొడిచారు. ఆడబిడ్డ పథకం ఊసేలేదు. , రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ. 20 వేలు ఇస్తామన్నారు. అదీ లేదు. నిరుద్యోగులకు నెలకు రూ. 3 వేలు అన్నారు. వాలంటీర్‌లకు నెలకు పదివేల ఇస్తామన్నారు. ఇంత వరకు ఈ పథకాలను అమలు చేయకుండా ప్రజలందరికీ వెన్నుపోటు పొడిచారు. మామ ఎన్‌టీ రామారావుకు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబుకు ప్రజలందరికీ వెన్నుపోటు పొడవడం నైజంగా మారింది. పథకాలు అమలు చేయలేక కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది.

- పి.రవీంద్రనాథ్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

## రైతులను నిండా ముంచారు..

రైతులు పంటలకు గిట్టుబాటు ధరలు లేక అల్లాడిపోతున్నారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్సు ఇవ్వలేదు. చంద్రబాబు , పవన్ కల్యాణ్, బీజేపీ కూటమి ఇచ్చిన హామీలను మరచిపోయారు. జమ్మలమడుగు లో దాల్మియా పరిశ్రమ వల్ల మూడు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శాసనసభ్యుడు ఆదినారాయణ రెడ్డి ఆ గ్రామాల ప్రజలకు న్యాయంజరిగిన తర్వాతే దాల్మియా రెండోప్లాంట్ ప్రారంభం అవుతుందని ప్రజాభిప్రాయ సేకరణకు ముందు గ్రామాల్లో తిరిగి చెప్పారు. ప్రజాభిప్రాయ సేకరణలో మాట మార్చి సిమెంట్ పరిశ్రమకు మద్దతు పలికి గ్రామ ప్రజలను మోసం చేశారు. కూటమి నేతలు మోసపూరిత వాగ్దానాలు ఇచ్చి అధికారంలోనికి రాగానే వాటిని తుంగలోతొక్కారు. కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ప్రజల తరపున వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుంది.

- రామసుబ్బారెడ్డి, ఎమ్మెల్సీ

## వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు

ఎన్నికల సందర్భంగా కూటమి నేతలు సూపర్ సిక్స్ హామీలతోపాటు 143 హామీలు ఇచ్చి ప్రజలను నమ్మించారు. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయింది. ఒక్క హామీని అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచారు. మామనే వెన్నుపోటు పొడిచిన చంద్రబాబుకు, ప్రజలను వెన్నుపోటు పొడవటం పెద్ద లెక్కకాదు. వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు. ముస్లిం మైనార్టీలకు అన్యాయం చేసే వక్ఫ్ బిల్లుకు బాబు మద్దతిచ్చి మోసం చేశారు. హామీలు పక్కనబెట్టి అక్రమ కేసులు బనాయిస్తూ.. అరాచక పాలన చేస్తున్నారు. చిన్నారులపై , మహిళలపై అఘాయిత్యాలు ఎక్కువయ్యాయి. అభివృద్ధిని పక్కనబెట్టి రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారు. కచ్చితంగా ప్రజలు బుద్ధి చెప్పే రోజు వస్తుంది.

- అంజద్‌బాషా, మాజీ డిప్యూటీ సీఎం

## ప్రజలకు మాయమాటలు చెప్పి మభ్యపెట్టారు

గత ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ప్రజలకు మాయ మాటలు చెప్పి మభ్యపెట్టారు. ఏడాది పాలన నుంచి ప్రజలను పక్కదారి పట్టించడానికే కడపలో మహానాడు నిర్వహించారు. మహానాడు సందర్భంగానైనా ఈ జిల్లాకు ఏం చేస్తారో చెప్పలేదు. బిర్యానీ ప్యాకెట్లు, మద్యం, నగదు ఇచ్చి జనాన్ని మహానాడుకు తరలించారు. మేము నిర్వహిస్తున్న 'వెన్నుపోటు దినం' కార్యక్రమానికి ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారు. అభివృద్ధి, సంక్షేమాన్ని పక్కనపెట్టి కూటమి నేతలు అరాచక పాలనను ప్రజలు గమనిస్తున్నారు.

- సురేష్‌బాబు, కడప మేయర్

## ఉద్యోగులకు ఇచ్చిన హామీల అమలేదీ.. ?

కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి రూ.3 వేలు హామీల సంగతి ఏమైంది. ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్లకు బకాయి ఉన్న 4 డీఏలను విడుదల చేసి పీఆర్‌సీ వేసి, ఐఆర్ ఇవ్వాలి. గత ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ పంపిణీ చేయగా, ఈ ప్రభుత్వం దాన్ని రద్దు చేసి మళ్లీ ప్రజలను క్యూ లైన్లలో నిలబెడుతూ ఇబ్బందులు పెడుతోంది.

- ఎంవీ రామచంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ

## క్లుప్తంగా

### లారీ, చౌక బియ్యం స్వాధీనం


పోలీసుల అదుపులో ఉన్న లారీ

**ఖాజీపేట :** పేదలకు అందాల్సిన చౌక బియ్యాన్ని అడ్డదారిలో తరలించుకు పోతున్న లారీని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వారి వివరాల మేరకు.. ప్రొద్దుటూరుకు చెందిన తాటి శాంతి కుమార్‌కు చెందిన ఏపీ 39 యూఏ 3609 నంబరు గల వాహనంలో 233 చౌక బియ్యం బస్తాలను ఎక్కించారు. బుధవారం తెల్లవారుజామున ప్రొద్దుటూరు నుంచి కడపకు తీసుకెళుతుండగా పక్కా సమాచారం మేరకు విజిలెన్స్ సీఐ శివన్న ఆయన బృందం వాహనాన్ని వెంబడించారు. ఖాజీపేట మండలం పాటిమీదపల్లె వద్ద ఉన్న టోల్ ప్లాజా వద్దకు రాగానే వాహనం స్వాధీనం చేసుకున్నారు. వాహన డ్రైవర్ పుట్టాల ఓబులేసు, దేవగుడి రామాంజనేయులును అదుపులోకి తీసుకున్నారు. వాహనాన్ని ఖాజీపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్కడ పరిశీలించగా 1,417 కేజీలు బరువు గల 233 బస్తాలు ఉన్నట్లు గుర్తించారు. ఈమేరకు కేసు నమోదు చేశారు.

### ద్విచక్ర వాహనం ఢీకొని..


మృతి చెందిన బాలస్వామి

**ఖాజీపేట :** రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీ కొని పుల్లూరు బాలస్వామి (47) అనే వ్యక్తి మృతి చెందాడు. పుల్లూరు బంగ్లా వద్ద ఉన్న బాల స్వామి పని నిమిత్తం రావులపల్లె చెరువు వద్ద దిగి రోడ్డు దాటుతుండగా కడప నుంచి వేగంగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీ కొంది. దీంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తి బంధువులు అక్కడికి చేరుకుని చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఖాజీపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

### ఆటో బోల్తా పడి 8 మందికి గాయాలు

**పులివెందుల రూరల్ :** తొండూరు మండలం సైదాపురం గ్రామ సమీపంలోని గోడౌన్ వద్ద ముద్దనూరు రోడ్డు వైపు వెళ్తున్న ఆటో టైర్ పగిలి బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న 8 మందికి గాయాలయ్యాయి. ఆటోలో ఉన్న నందిని, కళావతి, శివాని, సుహాసిని, శివజ్యోతి, ప్యారి, సరస్వతితో పాటు ఆటో డ్రైవర్కు గాయాలయ్యాయి. చికిత్స కోసం వారిని 108 వాహనంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కడపకు సిఫార్సు చేశారు.

# టీడీపీ నేతల దాష్టీకం

- బాధితులను పరామర్శించిన ఎంపీ
- కేసు నమోదు చేయాలని డిమాండ్


చలపతి కుటుంబ సభ్యుల విషయమై పోలీసులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

**సాక్షి టాస్క్‌ఫోర్స్ :** కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటినుంచి పులివెందులలో అధికార పార్టీ నాయకుల ఆగడాలు హెచ్చుమీరుతున్నాయి. అధికార పార్టీ నాయకుల అడుగులకు మడుగులొత్తుతున్న పోలీసు అధికారులను అడ్డుపెట్టుకుని దౌర్జన్యాలు రోజు రోజుకు అధికమవుతున్నాయి. ఇప్పటికే నియోజకవర్గంలో ఆదాయం కోసం ఇసుక, మట్టి, ముగ్గురాయి అనేక వనరులను కొల్లగొడుతున్న టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులకు తెగబడుతున్నారు. అందులో భాగంగా వారం రోజుల క్రితం వైఎస్సార్ విగ్రహానికి టీడీపీ జెండాలు, తోరణాలు కట్టారని పోలీసు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ ఆధ్వర్యంలో కొంతమంది వైఎస్సార్‌సీపీ నాయకులు టీడీపీ జెండాలు, తోరణాలను వైఎస్సార్ విగ్రహం వద్ద తొలగించారు. ఈ నేపథ్యంలో వాటిని తొలగించినందుకు అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్ల మేరకు పోలీసుల అత్యుత్సాహంతో హత్యాయత్నం కేసు దాదాపు 15మంది వైఎస్సార్‌సీపీ నాయకుల మీద నమోదు చేసిన విషయం విదితమే. అందులో ఎస్టీ కులానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు చలపతిని కూడా కేసులో ఇరికించడంతో అతను పులివెందుల సబ్‌జైలులో రిమాండ్‌లో ఉన్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం అర్ధరాత్రి 12గంటల ప్రాంతంలో నగరిగుట్ట ప్రాంతానికి చెందిన టీడీపీ నాయకుడు శ్రీను మరికొంతమంది వ్యక్తులతో కలిసి చలపతి ఇంటికి చేరుకుని వారి ఇంట్లో ఉన్న మహిళలపై దాడి చేశారు. ఈ సందర్భంగా చలపతి కుటుంబ సభ్యులు తీవ్రంగా ప్రతిఘటించారు. దాడి జరిగిన విషయాన్ని మంగళవారం అర్ధరాత్రి చలపతి కుటుంబ సభ్యులు పులివెందుల అర్బన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా వారు పట్టించుకోలేదు. ఈ విషయం తెలుసుకున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి బుధవారం మధ్యాహ్నం చలపతి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే దాడి జరిగిన విషయాన్ని పులివెందుల సీఐకి ఫోన్ చేసి ఇప్పటికే అక్రమ కేసు పెట్టి చలపతిని జైలులో ఉంచారని, ఇప్పుడు వారి కుటుంబ సభ్యులపైన టీడీపీ నాయకులు దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. వెంటనే బాధితుల ఫిర్యాదు మేరకు టీడీపీ నాయకులమీద కేసు నమోదు చేయాలని ఎంపీ గట్టిగా డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, వాటర్ ప్లాంటు వీరారెడ్డి, కోడి రమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో తోసేయడంతో వ్యక్తి మృతి


మృతి చెందిన చెంద్రాయుడు

**జమ్మలమడుగు రూరల్ :** మద్యం మత్తులో ఒక వ్యక్తి మరో వ్యక్తిని తోసేయడంతో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన జమ్మలమడుగు మండలం గూడెంచెరువు గ్రామం రాజీవ్‌నగర్‌లో జరిగింది. పట్టణ ఎస్ఐ హేమలత ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి. గూడెం చెరువు గ్రామంలోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన చెంద్రాయుడు (30) అదే కాలనీకి చెందిన నాగేంద్ర యాదవ్ కలిసి కాలనీలోని పెద్దమ్మ గుడి సమీపంలో మంగళవారం రాత్రి మద్యం సేవించారు. మద్యం మత్తులో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలో చెంద్రాయుడును నరేంద్ర యాదవ్ తోసేయడంతో పక్కన ఉన్న రాయి తలకు తగిలింది. దీంతో తీవ్ర రక్తస్రావమైన అతనికి కుటుంబ సభ్యులు స్థానికంగా ఉన్న ఆర్ఎంపీ డాక్టర్ వద్ద ప్రాథమిక చికిత్స చేయించారు. అనంతరం జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు బేల్దార్ పనులు చేసుకొని జీవించేవాడు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో బస్సు అటెండర్‌కు తీవ్ర గాయాలు

**మదనపల్లె రూరల్ :** రోడ్డు ప్రమాదంలో బస్సు అటెండర్ తీవ్రంగా గాయపడిన ఘటన బుధవారం వాల్మీకిపురం మండలంలో జరిగింది. అనంతపురం నుంచి మదనపల్లె, వాల్మీకిపురం, తిరుపతి మీదుగా చెన్నైకి వెళ్లే ఇంద్ర ఆర్టీసీ బస్సు మంగళవారం రాత్రి బయలుదేరింది. బుధవారం తెల్లవారుజామున వాల్మీకిపురం మండలం విఠలం సమీపంలో డ్రైవర్ బస్సును హైవే మీదకు మళ్లించాడు. అయితే వెంటనే రోడ్డు పూర్తి కాలేదన్న కారణంతో..బస్సును వెనక్కు తిప్పేందుకు రివర్స్ తీస్తూ బస్సు అటెండర్ హరిప్రసాద్(58)ను గమనించమని చెప్పాడు. అతను బస్సు వెనుక వైపు నిల్చుని డ్రైవర్‌కు సూచనలిస్తూ అదుపుతప్పి కిందపడ్డాడు. ఇది గమనించని డ్రైవర్ బస్సును వెనక్కు నడపడంతో హరిప్రసాద్ కాళ్లపై బస్సు వెళ్లింది. దీంతో ప్రమాదంలో రెండు కాళ్లు విరిగాయి.

## రోడ్డు ప్రమాదంలో జార్ఖండ్ వాసి..


రోడ్డుప్రమాదంలో మృతి చెందిన సర్ఫరాజ్

**మదనపల్లె రూరల్ :** రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జార్ఖండ్ వాసి మృతి చెందిన ఘటన బుధవారం సాయంత్రం మదనపల్లె మండలంలో జరిగింది. వలసపల్లె పంచాయతీ మొలకలదిన్నె వద్ద బీడీఎస్ ఫంక్షన్ హాల్‌లో జార్ఖండ్‌కు చెందిన సర్ఫరాజ్ (27) పనిచేస్తున్నాడు. అతనికి ప్రతిరోజు సాయంత్రం జిమ్‌కు వెళ్లే అలవాటు ఉండటంతో, బుధవారం సాయంత్రం ద్విచక్రవాహనంలో మదనపల్లెలోని జిమ్ సెంటర్‌కు బయలుదేరాడు. మార్గమధ్యంలోని డ్రైవర్స్ కాలనీ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో రోడ్డుపై అధిక రక్తస్రావమై తీవ్ర గాయాలపాలయ్యాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించిన తాలూకా పోలీసులు వాహనం అదుపుతప్పి కిందపడి గాయాలపాలై మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. అయితే గుర్తు తెలియని వాహనం ఢీకొందా..? లేక వాహనం అదుపుతప్పి కిందపడి మృతి చెందాడా అనే విషయం దర్యాప్తులో తేలాల్సి ఉంది. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

## రేషన్ పంపిణీలో అవకతవకలు తగదు


బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న రాయచోటి తహసీల్దార్ నరసింహకుమార్

**రాయచోటి టౌన్ :** దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి వద్దే రేషన్ పంపిణీ చేయాలని రాయచోటి తహసీల్దార్ నరసింహకుమార్ రేషన్ షాపు డీలర్లకు సూచించారు. సాక్షి దినపత్రికలో ప్రచురితమైన రేషన్.. పరేషాన్ అనే కథనంపై ఆయన స్పందించారు. బుధవారం రాయచోటి పట్టణంలోని పలు రేషన్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రేషన్ షాపుల వద్ద డీలర్లు పంపిణీ చేస్తున్న విధానంలో తేడాలు గమనించి వారిని హెచ్చరించారు. తూకాలలో మోసం చేయరాదని అలా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి కార్డుదారుడి వివరాలు గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ వద్ద ఉన్న పెన్షన్ ఆధారంగా సరి చూడాలన్నారు.

## ఉత్సాహంగా అండర్–23 క్రికెట్ టోర్నమెంట్


125 పరుగులు చేసి నాటౌట్ గా నిలిచిన వీరారెడ్డి


80 పరుగులు చేసిన చిత్తూరు బ్యాట్స్‌మెన్ లోహిత్ లక్ష్మీ నారాయణ

**కడప వైఎస్ఆర్ సర్కిల్ :** జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్– 23 వన్డే క్రికెట్ టోర్నీ ఉత్సాహంగా సాగుతోంది. బుధవారం వైయస్ రాజారెడ్డి ఏసీఏ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో చిత్తూరు జట్టుపై 7 వికెట్ల తేడాతో అనంతపురం జట్టు ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న చిత్తూరు జట్టు 45.1 ఓవర్లలో 217 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని రెడ్డి రుషిల్ 60, లోహిత్ లక్ష్మీనారాయణ 80 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని దీపక్ 3, ప్రదీప్ రెడ్డి 3 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 218 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 25.5 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 222 పరుగులు చేసి 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని కే హెచ్. వీరారెడ్డి అద్భుతంగా బ్యాటింగ్ ప్రదర్శించి 125 పరుగులు (సెంచరీ) చేసి నాటౌట్‌గా నిలిచాడు. 69 బంతులను ఎదుర్కొని 14 బౌండరీలు, 7 బౌండరీ సిక్సులు సహాయంతో 125 పరుగులు చేశాడు. అర్జున్ టెండూల్కర్ 27 పరుగులు చేశాడు. చిత్తూరు జట్టులోని మహమ్మద్, రెడ్డి ప్రకాష్, డేనియల్ లు ఒక్కో వికెట్ తీసుకున్నారు.

**కేఎస్ఆర్ఎం మైదానంలో..**

కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో కడప జట్టుపై 13 పరుగుల తేడాతో నెల్లూరు జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న నెల్లూరు జట్టు 31.0 ఓవర్లలో 145 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని నిఖిలేశ్వర్ రెడ్డి 28, అఖిల్ సాలుంకే 26 పరుగులు చేశారు. కడప జట్టులోని షేక్ ఆదిల్ హుస్సేన్ 4, చెన్నారెడ్డి 3, విజయ భావేంద్రారెడ్డి 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 146 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 37.4 ఓవర్లలో 132 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయి ఓటమి చవి చూసింది. ఆ జట్టులోని నాగ చాతుర్య 32, షేక్ ఆదిల్ హుస్సేన్ 40 పరుగులు చేశారు. నెల్లూరు జట్టులోని సాత్విక్ 3, సయ్యద్ అతిక్ సల్మాన్ 3, మాధవ్ 2 వికెట్లు తీసుకున్నారు.

## హెల్త్ ఎడ్యుకేటర్ల హోదా మార్పు

ఇకపై హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్లుగా కొనసాగింపు

**ప్రొద్దుటూరు క్రైం :** వైద్య ఆరోగ్యశాఖలో క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ హోదాను డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా ప్రభుత్వం మార్పు చేసినట్లు రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు జయప్రకాష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు వివిధ రకాల వ్యాధుల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆరోగ్య సిబ్బందికి ట్రైనింగ్ ఇవ్వడంతో పాటు ప్రాంతీయ కంటి ఆస్పత్రులు, పీహెచ్‌సీలు, మెడికల్ కాలేజీల్లో సేవలు అందిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ క్యాడర్‌ను డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా హోదా మార్పు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీఎంఎస్ నంబర్ 64 ద్వారా బుధవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ హెల్త్ ఎడ్యుకేటర్స్ సర్వీస్, వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ జయప్రకాష్‌తో పాటు వైస్ ప్రెసిడెంట్లు సాధు వెంకటేశ్వర్లు, మహమ్మద్‌రఫి, వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు మల్లయ్య కార్యవర్గ సభ్యులు హర్షం వ్యక్త చేశారు.

## అవినీతి పనులు చేయాలని వేధిస్తున్నారు

వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగి ఆవేదన

**సాక్షి టాస్క్‌ఫోర్స్ :** అవినీతి పనులు చేయాలని వేధింపులకు గురిచేస్తున్నారు. నేను అక్రమాలకు పాల్పడలేను. మానసికంగా ఒత్తిడి తట్టుకోలేక సెలవులో ఉన్నాను. ఆ సెలవును పొడిగించాలని ఒక సీనియర్ అసిస్టెంట్ వేడుకోవడం సంచలనంగా మారింది. వివరాలలోకి వెళితే.. వైద్య ఆరోగ్య శాఖలో అది జోనల్ స్థాయి విభాగం. అక్కడ ఒక సీనియర్ అసిస్టెంట్ విధులను చేపడుతున్నారు. ఏ కారణం చేతనో తెలియదు ఒక నెల రోజులుగా సెలవులో ఉన్నారు. సెలవు గడువు ముగిసింది. ఈ నేపథ్యంలో ఆ సీనియర్ అసిస్టెంట్ మరో నెల గడువు పొడిగించాలని అభ్యర్థించారు. అంత వరకు బాగానే ఉంది. సెలవు గడువు పొడిగించడానికి చెప్పిన కారణాలే సంచలనంగా మారాయి. అవినీతి..అక్రమాలకు పాల్పడాలని.. చెప్పింది చేయాలని వేధింపులకు గురి చేస్తున్నారు. నేను నైతిక విలువలకు కట్టుబడి ఉంటాను. అవినీతి పనులు చేయలేను. వేధింపుల కారణంగానే నేను మానసిక ఒత్తిడికి లోనయ్యాను. నా సెలవును మరో నెల రోజుల పాటు పొడిగించాలి.. అని పై అధికారికి విన్నవించారు. ఈ అంశం వైద్య ఆరోగ్య శాఖ విభాగాల్లో చర్చనీయాంశంగా మారింది.

# భారీగా మొబైల్‌ఫోన్లు రికవరీ

- రూ.1.20 కోట్ల విలువ గల 601 మొబైల్‌ఫోన్లు అప్పగింత
- 7వ విడత మొబైల్ ఫోన్ల రికవరీ మేళా
- మీడియా సమావేశంలో అన్నమయ్య జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు


బాధితులకు మొబైల్ ఫోన్లు రికవరీ చేసి ఇస్తున్న అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

**రాయచోటి :** పోలీస్ బృందం చేపట్టిన మొబైల్ ఫోన్ల రికవరీ సత్ఫలితాలను ఇస్తోంది. అన్నమయ్య జిల్లా పోలీసుల పరిధిలో ఏడో విడతగా 601 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి శభాష్ అనిపించుకున్నారు. ఒక కోటి 20 లక్షల రూపాయల విలువ చేసే 601 మొబైల్‌ఫోన్లను రికవరీ చేసి బుధవారం జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు చేతుల మీదుగా ఫోన్లు పోగొట్టుకున్న వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 2024 నవంబర్ నుంచి మే నెల 2025 వరకు 1300 మొబైల్‌ఫోన్లు పోగొట్టుకోవడం, దొంగతనంపై ఫిర్యాదులు అందాయన్నారు. ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి ప్రత్యేక బృందం ద్వారా ఫోన్ల రికవరీ కోసం అందుబాటులో ఉన్న అధునాతన సాంకేతికతను వాడుకోవడంతో మంచి ఫలితాలు వచ్చాయన్నారు. నెల రోజుల వ్యవధిలో జిల్లా సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.మహమ్మద్‌అలీ, టెక్నికల్ అనాలిసిస్ వింగ్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ టి.జాన్ జోసెఫ్ ఆధ్వర్యంలో సైబర్ క్రైం సిబ్బంది మొబైల్ ఫోన్ల రికవరీ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు సంయుక్తంగా పనిచేశాయన్నారు. ఇప్పటి వరకు రూ.3.16 కోట్ల విలువ గల 1627 మొబైల్ ఫోన్లను 7 విడతలలో రికవరీ చేశామని తెలిపారు. రికవరీ చేసిన మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేస్తామని చెప్పారు.

**మొబైల్ ఫోన్ పోతే..**

మొబైల్ ఫోన్ పోతే జిల్లా పోలీస్ ఎల్ఎంటీఎస్ వాట్సాప్ నెంబర్ 8688830012కు హాయ్ అని మెసేజ్ చేసిన వెంటనే మీరు ఒక గూగుల్ లింక్‌ను రిసీవ్ చేసుకుంటారన్నారు. ఆ లింకును క్లిక్ చేసి మీ వివరాలు, మీ మొబైల్ ఐఎంఈఐ నెంబర్లు మొదలగు వివరాలను తెలియపరుస్తూ ఆ మొబైల్‌ను కొన్న బిల్ పేపర్ లేదా మొబైల్ బాక్స్‌ను మీరు అప్‌లోడ్ చేసి సబ్మిట్ చేయాలని వివరించారు. లేదా సీఈఐఆర్ httpr://w-ww/-c-e-ir.g-o-v.i n/H-o-me/index.jr p లింకును నొక్కడం ద్వారా పోయిన మొబైల్స్ ఫిర్యాదుల స్వీకరణకు ఎఫ్ఐఆర్ కట్టకుండా పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండా సులభతరం చేశామని చెప్పారు.

**అపరిచితుల నుంచి ఫోన్లను కొనరాదు..**


సెల్‌ఫోన్ దుకాణం నిర్వాహకులు అపరిచితులు అమ్మే ఫోన్లను కొనుగోలు చేయరాదని ఎస్పీ సూచించారు. అమ్మేవారు పరిచయస్తులైనా సరే బిల్లులు, సంబంధిత మొబైల్ ఫోన్ వివరాలు కలిగిన బాక్సు ఉంటేనే కొనుగోలు చేయాలని తెలిపారు.

**పక్క రాష్ట్రాల నుంచి..**

మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న, చోరీకి గురైన వాటి కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ ప్రత్యేక బృందాలు మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, మహారాష్ట్ర, ఒడిస్సా, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా మొబైల్‌ఫోన్లను రికవరీ చేశారన్నారు. ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేయడంలో కృషి చేసిన సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ ఎస్.మహమ్మద్‌అలీ, టెక్నికల్ అనాలసిస్ వింగ్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ టి.జాన్ జోసెఫ్, సైబర్ క్రైమ్ సిబ్బంది, మొబైల్ రికవరీ బృందాలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. సిబ్బందికి రివార్డ్స్ ఇచ్చి ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు పి.రాజారమేష్, కె.రాజారెడ్డి, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ తులసీరామ్, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు మధు, రాఘవరెడ్డి, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శంకరమల్లయ్య, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ, పెద్దయ్య, ఇతర పోలీస్ అధికారులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పేకాట జోరు.. బతుకు తారుమారు

- జాకీ, క్వీన్, కింగ్, ఆస్ అంటూ జిల్లాలో పేకాట స్థావరాలు
- ఎక్కడికక్కడ జేబులు నింపుకుంటున్న మంత్రి అనుయాయులు
- రోజుకు టర్నోవర్ కోటి రూపాయలు పైబడే
- రాయచోటి, చిన్నమండెం కేంద్రాలుగా యథేచ్ఛగా జూదం
- అన్నమయ్య జిల్లాలో విస్తరిస్తున్న పేకాట



**టాస్క్‌ఫోర్స్ :** కూటమి ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి పనులు ఎక్కడా కనిపించకపోయినా పేకాట క్లబ్బులు మాత్రం అన్నమయ్య జిల్లాలోని మంత్రి ఇలాకాలో మూడు పువ్వులు 36 కాయలుగా కనిపిస్తున్నాయి. జాకీ, క్విన్, కింగ్, ఆస్ అంటూ పేకాట స్థావరాలు విరాజిల్లుతున్నాయి. అసాంఘిక కార్యక్రమాల పట్ల కఠినంగా వ్యవహరించాల్సిన ఖాకీ, ఖద్దరులే కాపలాగా మారి పేకాట స్థావరాలను యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. ఒక్క చిన్నమండెం మండల పరిధిలోనే రోజుకు కోటి రూపాయలకు పైగానే పేకాట జరుగుతున్న మాట అక్షర సత్యం, రాయచోటి పట్టణ పరిధిలోని శివారు ప్రాంతాలలో నూతనంగా నిర్వహిస్తున్న గృహాలు, గ్రామీణ ప్రాంతాలలోని మామిడి తోటలు, ఫామ్ హౌస్‌లలో పేకాట జోరుగా నడుస్తోంది. ఆట నిర్వహణ ద్వారా రోజుకు లక్షల రూపాయలు ఆదాయాన్ని నిర్వాహకులు గడిస్తున్నారు. వచ్చిన ఆదాయంలో మంత్రి అనుయాయులకు సగం డబ్బులు ముడుతున్నట్లు ప్రచారం ఉంది. ఆటలలో పాల్గొని వారి నుంచి ఎంట్రీ ఫీజుగా రూ. 3 వేల నుంచి రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. వీటి నిర్వహణలో పోలీస్ శాఖలోని ఓ నిఘా అధికారి ఇటీవలనే పేకాట కారణంగా సస్పెండ్‌కు గురైనా పోలీసు హస్తం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటితోపాటు పక్కనే ఉన్న చిన్నమండెం మండలంలో పేకాట జోరుగా సాగిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కూర్చున్న చోటనే సులభంగా డబ్బులు సంపాదించాలన్న ఆశతో కొంతమంది జేబులు గుల్ల చేసుకుంటున్నారు. ఆశకు వెళ్లి జీవితాలను చిన్నాభిన్నం చేసుకుంటున్నారు. మంత్రి నియోజకవర్గమైన రాయచోటి, ఆయన సొంత మండలమైన చిన్నమండెం మండల పరిధిలోని పలు ప్రాంతాలలో జూద శాలలు నడుస్తున్నాయి. ఎవరైనా పోలీసులకు సమాచారం ఇచ్చినా మంత్రి ఇలాకాలోని గ్రామాలలోకి పోలీసులు అడుగులు వేయలేకపోతున్నారు. ఒకవేళ దాడులు నిర్వహించినా స్టేషన్‌కు వెళ్లకుండానే పట్టుబడిన పేకాట రాయుళ్లు దర్జాగా ఇళ్లకు వెళ్తున్నారు. స్థానిక పోలీసుల నుంచి చర్యలు లేకపోవడంతో జిల్లా ఎస్పీ నేరుగా కొంతమంది సిబ్బందిని నియమించుకొని కఠిన చర్యలు చేపడుతున్నా జూదరుల ఆగడాలకు అడ్డుకట్ట పడటం లేదన్న వాదనలు ఉన్నాయి. అనేక మంది వ్యాపారులు, ఉద్యోగులు, సాధారణ కుటుంబ సభ్యులు లక్షలు, కోట్ల రూపాయలు ఆస్తులు అమ్మి పేకాటలో పెట్టి నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు.

**ఇల్లు.. మామిడి తోటలే అడ్డాలు..**

ఎవరికీ అనుమానం రాకుండా పేకాటరాయుళ్లు ఇల్లు, మామిడి తోటలు, ఫామ్ హౌసులు, అటవీ ప్రాంతాలలో ప్రత్యేక స్థావరాలపై ఏర్పాటు చేసుకుంటున్నారు. ఆట ఆడేవారికి మినహా మరెవ్వరికీ సమాచారం లేకుండా గుట్టు చప్పుడు కాకుండా పేకాట స్థావరాల వద్దకు జనం చేరుకుంటున్నారు. చీకటి పడే వరకు ఈ ఆటలు కొనసాగుతున్నాయి. రోడ్ల వెంట సీసీ కెమెరాలు, ఇన్‌ఫార్మర్లను పెట్టుకొని జూద శాలలను నిర్వహిస్తున్నట్లు సమాచారం.

**ఇతర జిల్లాల నుంచి..**

అన్నమయ్య జిల్లాలోని పేకాట స్థావరాలకు స్థానికులే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా జూదరులు పెద్ద ఎత్తున వస్తున్నారు. కడప, చిత్తూరు, అనంతపురం, కర్ణాటక రాష్ట్ర ప్రాంతాల నుంచి జూదరులు వస్తున్నారు. గ్రామాల వారిగా పోలీసులకు బాధ్యతలు అప్పగించినా దాడులు చేసి వాటి నివారణ చర్యలు చేపట్టిన సంఘటనలు లేవనే చెప్పవచ్చు. పేకాట ఆడుతున్న సమయంలో ఎవరైనా పోలీసులు దాడులు చేస్తే చాలా మంది జూదరులు వారి కళ్లు గప్పి పారిపోతున్నారు.

**జిల్లా వ్యాప్తంగా..**

మంత్రి ఇలాకాలో విచ్చలవిడిగా జరుగుతున్న పేకాట కారణంగా మంత్రి అనుయాయులకు రోజువారిగా సమకూరుతున్న ఆదాయాన్ని చూసి జిల్లాలోని మిగిలిన నేతలు కూడా పేకాట స్థావరాల నిర్వహణకు మొగ్గుచూపుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఇప్పటికే పోలీసు శాఖలో పనిచేస్తూ సస్పెండ్‌కు గురైన కానిస్టేబుల్, కడపలో పోలీసులకే డాన్‌గా వ్యవహరిస్తున్న అశోక్ రెడ్డి, మదనపల్లికి చెందిన హేమంత్ రెడ్డి, చిన్నమండెంలోని నర్సరీ రమణ, మల్లూరు శేఖర్ రెడ్డి, నిఘా అధికారికి అత్యంత సన్నిహితుడైన దాబా అంజిలతోపాటు రాయచోటిలో మంత్రి ముఖ్య అనుచరుడు వీటి నిర్వహణలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నట్లు తెలియవచ్చింది.

**అడ్డుకట్ట పడేది ఎలా. ?**

విచ్చలవిడిగా జరుగుతున్న పేకాటను అడ్డుకునేందుకు పోలీసులు చర్యలు చేపట్టడం అవసరం. జూదం ఆడేవారికి కోర్టులో కఠిన శిక్షలు లేకపోవడంతో చాలా మంది పట్టుబడినా తమ ప్రవర్తన మార్చుకోవడం లేదని తెలుస్తోంది. పట్టుబడిన జూదరులు బయటకు వచ్చి మరలా పేకాట ఆడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలు తెస్తే తప్పా జూదానికి అడ్డుకట్ట పడేలా లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు.